పసుపునకు తెగుళ్ల దెబ్బ

- తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో క్వింటా రూ.10 వేల లోపే
- పసుపు రైతుకు తప్పని నష్టాలు



పసుపు కొమ్ముకు సోకిన కుళ్లు తెగులు



పసుపు దిగుబడి

పాణ్యం: పుడమిని నమ్ముకుని వ్యవసాయం చేసే రైతులకు అవస్థలు తప్పడంలేదు. విత్తు మొదలు కోతలు, విక్రయాల వరకు అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది పరిస్థితి మరీ దయనీయంగా మారింది. పంటలకు మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారు. ఏ పంట సాగుచేసినా సరైన ధర లేక అప్పుల పాలవుతున్నారు. వరి నుంచి అన్ని రకాల పంటలకు మార్కెట్‌లో మద్దతు ధర కరువైంది. కూటమి ప్రభుత్వం రైతులకు ఆదుకుంటామని, ధరల స్థిరీకరణతో గిట్టుబాటు కల్పిస్తామని హామీలు ఇచ్చినా అవేవీ కార్యరూపం దాల్చలేదు. పాణ్యం మండలంలో ఈ ఏడాది 40 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. సాగు ప్రారంభమైనప్పటి నుంచి పంటలకు కొత్తరకం తెగుళ్లు సోకడంతో పసుపు కొమ్ములు అంతగా వృద్ధి కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు

ఈ ఏడాది పసుపు పంట సాగుచేసిన రైతులకు పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగాయి. కొత్త రకం తెగుళ్ల సోకడం, వాటి నివారణకు అధికంగా మందులు పిచాకారీ చేయాల్సి వచ్చింది. దీంతో ఎకరాకు రూ. లక్షకుపైగానే పెట్టుబడి ఖర్చు పెరిగిందని రైతులు చెబుతున్నారు. అంతేకాక పంట బాగుంటే 25 క్వింటాళ్ల వరకు వచ్చేది. అయితే ఈ కుళ్లు తెగులుతో ఎకరానికి 15 నుచి 20 క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొదటి నుంచి విపరీతమైన తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గినట్లు రైతులు తెలిపారు.

మార్కెట్‌లో ధరలు ఢమాల్

ఈ ఏడాది పసుపు పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం క్వింటా రూ. 8 వేల నుంచి రూ. 9వేలు మాత్రమే పలుకుతోందని రైతులు చెబుతున్నారు. గతంలో క్వింటా రూ. 14వేల వరకు ఉండేదని తెలిపారు. ఈసారి పంటకు అధిక తెగుళ్లతో పాటు దిగుబడి తగ్గడం, దానికి తోడు మార్కెట్‌లో ధర అంతంత మాత్రమే ఉండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

మద్దతు ధర పెంచాలి

ప్రభుత్వం పసుపు గిట్టుబాటు ధరను పెంచాలి. ఇప్పుడున్న ధరతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. పసుపు ఎకరానికి రూ. లక్షకు పైగానే పెట్టుబడి వచ్చింది. ఈ ధరతో రైతులు, కౌలు రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని మార్కెట్‌లో మద్దతు ధరను పెంచాలి. లేకుండా పసుపు రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతారు.

–చంద్ర, పసుపు రైతు, పాణ్యం

పెద్దాసుపత్రిలో చలివేంద్రాలు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. శ్రీ సద్గురు దత్త కృపాలయం ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని సూపర్‌స్పెషాలిటీ బ్లాక్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, గైనిక్, ట్రామాకేర్‌లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ సద్గురు దత్త కృపాలయం వారు ఆసుపత్రిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, 23 సంవత్సరాల నుంచి రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. అందులో ప్రతిరోజూ రోగుల సహాయకులకు మధ్యాహ్న భోజనం వెయ్యి మంది వరకు అందించడం అభినందనీయమన్నారు. గతంలో ఆసుపత్రికి అవసరమైన పరికరాలు కూడా వారు అందించినట్లు గుర్తు చేసుకున్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, శ్రీ సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్ మల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్, సెక్రటరి శ్రీధర్ గుప్త, నిర్మల పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు.

ఆరాధనోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడులో వెలసిన యాగంటీశ్వరస్వామి ఆరాధనోత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. ఆలయ అర్చకుడు ఉరుకుందయ్యాచార్యులు ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక అలంకరణతో ఆరాధనోత్సవాలకు ముస్తాబు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖరప్ప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బురాన్‌దొడ్డి గోకారమయ్య ఉరుసు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం నుంచి గోకారమయ్య ఉరుసు ఉత్సావాలు ప్రారంభం కానున్నాయి. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం కిస్తీ కార్యక్రమాలు నిర్వహించనునట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు పలుకుదొడ్డిలో..

పలుకుదొడ్డి గ్రామంలో ఆదివారం బడేఖాన్ ఖాద్రీ (బడేసాహెబ్) ఉరుసు ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్గాను సందర్శించి స్వామి వారికి చదివింపులు చేయించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరికి గాయాలు



గాయపడిన సుబ్బరాయుడు

గడివేముల: మండలంలోని వేర్వేరు చోట్ల బైక్ అదుపు తప్పి కిందపడడంతో శనివారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక మోడల్ స్కూల్‌లో పరీక్షల విధులు నిర్వహించి ఇంటికి లిఫ్ట్ అడిగి బైక్‌పై వస్తుండగా ఆశా వర్కర్ మహేశ్వరి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో నంద్యాలకు తరలించారు. అదేవిధంగా గడివేముల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు చిందుకూరు గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు అదుపు తప్పడంతో కిందపడి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వెండి కవచం విరాళం



ఈఓకు వెండి కవచం అందజేస్తున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గా భోగేశ్వరస్వామికి భక్తులు వెండి కవచం విరాళంగా ఇచ్చినట్లు ఈఓ రామానుజన్ తెలిపారు. శనివారం స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా నంద్యాలకు చెందిన ఉమామహేశ్వరరావు, లక్ష్మాబాయి జ్ఞాపకార్థం కుమారుడు లీలాకుమార్, దివ్యాబాయి దంపతులు స్వామివారికి రూ.2.5 లక్షల విలువ చేసే వెండి కవచం (1.750 గ్రాములు) బహూకరించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షణ ఆఫీసర్ హరిచంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 'సంపూర్ణ భగవద్గీత' పారాయణం

కర్నూలు కల్చరల్: స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకొని ఈనెల 10వ తేదీ 'సంపూర్ణ భగవద్గీత ' పారాయణం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఉదయం 9.30 గంటలకు పారాయణ యజ్ఞ జరుగుతుందని తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సునీల్ కుమార్

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో శనివారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను ఎస్‌ఐ సునీల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఎవరూ గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖరప్ప, మంద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎక్సలెన్స్ అవార్డు



అమృతను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కల్లూరు: దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి కాలేజీ ఫార్మడీ నాలుగో సంవత్సరం విద్యార్థిని నీలం అమృత అంతర్జాతీయ ఇండో కరేబియన్ కాన్ఫరెన్స్‌లో ప్రతిభ చాటారు. ఈ నెల 7న నంద్యాలలోని శాంతిరామ్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ ఇండో కరేబియన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాల నుంచి ''ఇన్నోవేషన్ ఇన్ డ్రగ్ డిజైన్, డెవలప్‌మెంట్, ఎనాలసిస్ అండ్ పేషంట్ కేర్–ఏ సీనరైజింగ్ సైన్స్ అండ్ ప్రాక్టీస్''లో ఎన్. అమృత ప్రతిభ చాటారు. దీంతో '' ఎక్సలెన్స్ అవార్డు '' లభించింది. శనివారం కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

పోలీసు కుటుంబాల మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



సేవలందించిన వైద్యులను శాలువ, మెమొంటోలతో సత్కరిస్తున్న ఎస్పీ, కమాండెంట్

కర్నూలు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకు ని పోలీసు కుటుంబాల మహిళలకు జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అమీలియో, ఒమెగా హాస్పిటల్ వైద్యులు పోలీసు కుటుంబాల మహిళలు 324 మందికి 2డి ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్, హెచ్‌బీ, కంటి తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, సిబ్బందికి శాలువలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. జిల్లా మహిళలకు ఎస్పీ, కమాండెంట్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డాక్టర్లు లక్ష్మీప్రసాద్, శృతి, రేవతి, విజయలక్ష్మి, విష్ణు చంద్రిక, మునీరా బేగం, పవన్ తేజ, ఆదిత్య, శిల్ప, మార్కెటింగ్ టీమ్ షేక్షావలి, రంజిత్ కుమార్, పోలీస్ వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డీఎస్పీలు శ్రీనివాసాచారి, బాబు ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, బాషా, భాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన గోదా గోకులం వార్షికోత్సవం



స్వామివారి పుష్పయాగ సేవలో గోదా గోకులం పరివారం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ గోదాదేవి సమేత రంగనాథస్వామి దేవస్థానం రెండవ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు 108 రజత కలశాలతో తిరుమంజనం కార్యక్రమాలు అత్యంత వైభంగా జరిగాయి. అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం పూజా క్రతువు నిర్వహించారు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామిలు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, ఇల్లూరు రామయ్య, రామ్‌ప్రసాద్, చిత్రాల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో బతుకుపోరు!



అక్షర జ్ఞానం లేకపోవడం, చిన్న వయస్సులోనే పెళ్లి జరగడం వల్ల ఇప్పటికీ కొందరు మహిళలు అవకాశాలను అందుకోలేకపోతున్నారు. వంటింటి కుందేళ్లుగా, చేతివృత్తులతో కాలం గడుపుతున్నారు. లోకమంతా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకుంటుంటే.. ప్రతి ఒక్కరూ 'ఆమె'ను వేనోళ్ల కీర్తిస్తుంటే.. ఇదిగో ఇలాంటి బడుగుజీవులు ఇప్పటికీ రోడ్లపై 'బతుకు వేట' సాగిస్తున్నారు. మేము నేటి మహిళలం అని కొందరు పురుషాధిక్య సమాజానికి సవాలు విసురుతుంటే, కాళ్లకు చెప్పుల్లేకుండా.. మండుటెండలో చంటిబిడ్డను చంకకెత్తుకుని పొట్ట కూటికి ఈమె నిత్య పోరాటం సాగిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



గడివేముల: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కల్లూరు: కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉలిందకొండలో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఏపీఎం పుష్పావతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జుబేదాబీ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.
–దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సమానత్వంతోనే మహిళా సాధికారత

గడివేముల: దశాబ్దాలుగా ఎంతోమంది మహనీయుల పోరాట ఫలితంగా దేశంలో స్త్రీ,పురుష సమానత్వం ఇప్పుడిప్పుడే సాకారం అవుతోందని రాజరాజేశ్వరి పాఠశాల హెచ్ఎం రాఘవేంద్రరావు అన్నారు. శనివారం పాఠశాల ఆడిటోరియంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు, గతంలో పనిచేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. మహిళా సాధికారత కోసం పరితపించిన మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. కుటుంబ స్థాయి నుంచే పిల్లలకు లింగ సమానత్వంపై అవగాహన పెంచితేనే సమాజంలో చైతన్యం సాధ్యమని మహిళా ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(రూరల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని పసుపల గ్రామంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని సచివాలయ మహిళా ఉద్యోగులు, మున్సిపల్ మహిళా సిబ్బందితో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం వారిని సన్మానించారు.

ఎస్టీ జాబితాలో ఇతరులను చేరిస్తే ఊరుకోం

- కులాల మధ్య చిచ్చుపెట్టడం కూటమి ప్రభుత్వానికి సరికాదు
- ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్



మాట్లాడుతున్న ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్

కల్లూరు: ఎస్టీ జాబితాలో ఇష్టం వచ్చినట్లు ఇతర కులాలను చేరిస్తే ఊరుకునేది లేదని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. శనివారం కర్నూలులోని బంజారా ధర్మసేన సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఇతర కులస్తులను, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ప్రస్తావించడం బాధాకరమైన విషయమన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో మాట్లాడడం, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర మంత్రి అమిత్ షాకు వినతి ప్రతం ఇవ్వడం సరికాదన్నారు. పుట్టపర్తిలో గిరిజనులు కూడా ఓట్లు వేసి గెలిపించారన్నా విషయాన్ని ఎమ్మెల్యే మరిచినట్టు ఉన్నారన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు కేవలం 7 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉందన్నారు. గిరిజనలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికీ కొన్ని గిరిజన గ్రామాలకు రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు లేవన్నారు. ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన ఇతర కులస్తులను గిరిజన జాబితాలో చేరుస్తామంటే గిరిజనులు అన్యాయానికి గురవుతారన్నారు. రాష్ట్రంలో గిరిజనుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. గిరిజనులకు అన్యాయం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం నాయక్, ఆనంద్, లోకేష్, ఏసు, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



ట్రాక్టర్‌ను ఢీకొని ఆగిన ఆర్టీసీ బస్సు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె–సిమెంట్ నగర్ ఘాట్‌లో పెను ప్రమాదం తప్పింది. శనివారం నంద్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బేతంచెర్ల నుంచి నంద్యాలకు వస్తోంది. సిమెంట్ నగర్ ఘాట్‌లో మలుపు వద్ద ట్రాక్టర్, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ క్రమంలో బస్సు కొండ సైడ్‌వాల్‌ను ఢీకొని ఆగింది. సెఫ్టీ వాల్ ఉన్నందున బస్సు నిలిచిందని స్థానికులు తెలిపారు. బస్సులో సుమారు 30 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో తరలించారు.

రోడ్డును కమ్మేస్తున్న ఇటుక బట్టీల పొగ



సి.బెళగల్ వద్ద రోడ్డును కమ్మిన పొగలో వాహన ప్రయాణం

- పట్టించుకోని అధికార యంత్రాంగం

సి.బెళగల్: మండల కేంద్రంలోని ఇటుకల బట్టీ నుంచి భారీగా వెలువడుతున్న పొలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులోని ఎమ్మిగనూరు – గూడూరు ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇటుక బట్టీని నిర్వాహకులు శనివారం ప్రాంభించారు. అయితే రోడ్డుకు అతి అసమీపంలో బట్టీ ఉండటం, వరి పొట్టు, కలప, బొగ్గు తదితర పదార్థాలతో ఇటుకలను కాల్చడంతో దట్టంగా పొగ కమ్ముకుంటోంది. దీంతో రోడ్డు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరింస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనారోగ్యంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్ రామకేశవులు (52) అనారోగ్యంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టులో విధులు నిర్వహించేవాడు. తీవ్ర అనారోగ్యంతో వారం రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేవాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. వెల్దుర్తి మండలం పేరువేముల గ్రామానికి చెందిన రామకేశవులు 1995లో ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. ప్రస్తుతం కర్నూలులోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఈయనకు భార్య సువర్ణ, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు సంతానం. శనివారం సుంకేసుల రోడ్డులోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, జగన్నాథం, అయ్యన్నతో పాటు సహోద్యోగులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈయన గతంలో కోడుమూరు, ఆదోని, పత్తికొండ ప్రాంతాల్లో కూడా పనిచేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



కొమ్మ విరిగి చెట్టుకు వేలాడుతున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని పాణ్యం–కొణిదేడు మార్గంలోని వొద్దెల వాగు వద్ద ఓ చెట్టు కొమ్మ విరిగి చెట్టుపైనే వాలాడుతోంది. చిన్నపాటి గాలి సోకినా ఆ కొమ్మ కిందపడే అవకాశం ఉంది. చుట్టు పక్కల గ్రామాల వారు చెట్టుపైకి చూసుకుంటూ జాగ్రత్తగా వెళ్తున్నారు. తెలియని వారు అలాగే వెళ్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి కొమ్మను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.